గుడుంబా స్థావరాలపై దాడులు

- పలువురిపై కేసులు నమోదు
- బెల్లం, గుడుంబా స్వాధీనం, ధ్వంసం

గూడూరు: స్వాధీనం చేసుకున్న గుడుంబా, బెల్లం పానకాన్ని చూపుతున్న పోలీసులు

నమస్తే తెలంగాణ నెట్ వర్క్, జూలై 11: ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసులు గురువారం గుడుంబా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. డోర్నకల్, గార్ల, గూడూరు, మరిపెడ, నర్సింహులపేట, గంగారం, దంతాలపల్లి, కేసముద్రం, నెల్లికుదురు మండలాల్లో సీఐలు, ఎస్సైలు పక్కా సమాచారంతో గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. డోర్నకల్‌లోని జోగ్యతండాలో 10 లీటర్ల గుడుంబా, 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ రావు తెలిపారు. గార్ల మండలంలోని చిన్నకిష్టాపురం, దేశ్యాతండాలో 15 లీటర్ల గుడుంబా, 20 కిలోల నల్లబెల్లంను స్వాధీనం చేసుకొని, 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై జీనత్ కుమార్ తెలిపారు. గూడూరు మండలంలోని గోవిందాపురం గ్రామంలో 300 లీటర్ల బెల్లం పానకం, 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశామని, మూడు చందు, మూడు సూక్య, ధరావత్ నరసింహ, స్వరూపపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాబురావు పేర్కొన్నారు. మరిపెడ మండలంలోని తానంచర్ల వాచ్చతండాలో బెల్లం, పటిక, పానకంతో పాటు గుడుంబాను స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ హఫీరాం తెలిపారు. నర్సింహులపేట మండలం కౌసల్యదేవిపల్లి శివారు రూప్లాతండాలో 200 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోసి, 10లీటర్ల గుడుంబాను ధ్వంసం చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ వివరించారు. జంగాలపల్లి తండాలో బెల్లం, 40 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. 20 కిలోల చక్కెరను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. దంతాలపల్లి మండలంలొని బీరిశెట్టిగూడెంలో 16 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని జంపాల అనసూర్య, బొమ్మగాని వెంకటేశ్వర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు. కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామంలో 200 లీటర్ల బెల్లం పానకం, 25 లీటర్ల గుడుంబాను ధ్వంసం చేసినట్లు ఎస్సై వంశీధర్ పేర్కొన్నారు. నెల్లికుదురు మండలంలోని నర్సింహులగూడెం శివారు నంద్యతండాలో బానోత్ సరోజ ఇంట్లో 400 లీటర్ల బెల్లం పానకం, 20 లీటర్ల గుడుంబా, గుగులోత్ కమల ఇంట్లో 200 లీటర్ల బెల్లం పానకం, 20 లీటర్ల గుడుంబా, బానోత్ వీర్య ఇంట్లో వెయ్యి లీటర్ల బెల్లం పానకం, 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే క్రాంతికిరణ్ తెలిపారు. వారు మాట్లాడుతూ.. నిషేధిత వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే సమాచారం అందించాలన్నారు. అనంతరం మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

'వనమహోత్సవం' లక్ష్యాలను పూర్తి చేయాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. గురువారం ఐడీవోసీలోని కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టోప్పోతో కలిసి వనమహోత్సవం, వైద్య ఆరోగ్యం, అమ్మ ఆదర్శ పాఠశాలలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించి ప్రణాళిక రచించాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవల్లో ఎలాంటి అంతరాయం కలుగకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోదే అన్నారు. సమావేశంలో అడిషనల్ డీఆర్డీవో శాంతకుమారి, జిల్లా వైద్యాధికారిణి కళావతిబాయి, జడ్పీసీఈవో నర్మద, అధికారులు పాల్గొన్నారు.

నేడు కొత్తగూడలో ప్రజాదర్బార్

కొత్తగూడ, జూలై 11: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం రైతువేదికలో నేడు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క హాజరవుతారన్నారు. మండల వాసులు ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమాజ శ్రేయస్సుకు సమన్వయంతో పని చేయాలి

ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్, జూలై 11: సమాజ శ్రేయస్సు కోసం మీడియా ప్రతినిధులు, పోలీసులు సమన్వయంతో పని చేయాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా ప్రతినిధులు, పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాలో లాఅండ్ ఆర్డర్ సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, గుట్కా, నల్లబెల్లం వంటి అక్రమ వాపారాలను అరికట్టడంలో చేయూతనివ్వాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మైనర్లు వాహనాలు, నంబర్‌ప్లేట్ లేకుండా నడపడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం వంటివి నేరాల కిందికి వస్తాయన్నారు. గంజాయి మత్తులో యువత, భూదందాలు, ఆందోళనలకు గురిచేసే రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేదిలేదని హెచ్చరించారు. ప్రజలు, పోలీసులకు మధ్య వారధులుగా మీడియా ప్రతినిధులు పని చేయాలన్నారు. మంచి వాతావరణంలో సమాజాన్ని తీర్చిదిద్దేందుకు అందరూ పాటుపడాలని సూచించారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

56 కిలోల గంజాయి పట్టివేత

- కారు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు

కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సర్వయ్య

మహబూబాబాద్ రూరల్, జూలై 11: అక్రమంగా తరలిస్తున్న 56 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో సీఐ సర్వయ్య వివరాలు వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం మండల శివారు గాంధీపురం వద్ద ఎస్సై దీపిక సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన ఇండికా కారులో అజిత్‌అరుణ్ తోసార్, పసుపు ఆనందరావు అనుమానాస్పదంగా కనిపించడంతో వెంటనే పోలీసులు పట్టుకొని తనిఖీ చేశారు. అందులో 56 కిలోల గంజాయి ఉన్నదని, కారు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్సై దీపిక, సిబ్బంది వెంకన్న, బాలరాజు, లింగరావు, కుమారస్వామి, శ్రీహరి, ఉమ, అశోక్‌ను ఎస్పీ సుదీర్‌రాంనాథ్ కేకన్ అభినందించారు.

గురునాథరావుకు డాక్టరేట్

మహబూబాబాద్ రూరల్, జూలై 11: మహబూబాబాద్‌కు చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు వూరే గురునాథరావుకు రాయలసీమ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకుడు బలరాములు నేతృత్వంలో విద్యార్థి కేంద్రీకృత విధానంలో బోధన అభ్యాసం ఇన్ సర్వీస్ భౌతిక రసాయన శాస్త్ర అంశాలపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్‌ను ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనల్లో పాల్గొని ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు గురునాథరావు పేర్కొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాళ్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్-2** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు మాపేన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **బానోతు రాంమూర్తి**, S/o : **రమ**, **వయస్సు** : 32 సం॥లు, **వృత్తి** : వ్యవసాయం, **నివాసం** : ఇ.నెం. దానియతండ, మల్లయ్యకుంట తండ, డోర్నకల్ మండలం, మహబూబాబాద్ జిల్లా గారికీ ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు వార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా కైయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : గ్రామ పంచాయితి మల్లయ్యకుంట తండ (పూర్వపు గ్రామపంచాయితి : రావిగూడెం), మండలం, మండల పరిషత్తు డోర్నకల్, జిల్లా, జిల్లా పరిషత్తు మహబూబాబాద్, జిల్లా రిజిష్టారు వరంగల్, సబ్ రిజిష్టారు మహబూబాబాద్ వారి పరిధిలో గల మల్లయ్యకుంట తండ గ్రామములోని గ్రామ పంచాయితి ప్రోసిడింగ్ నెం. 5/BP/2024లోని ఇ.నెం. 2-81 (Assessment No. 84)నకు సంబంధించిన గృహ ఆర్.సి.సి. కప్పు విస్తీర్ణం 732.00 SFT, గృహముతో సహ మొత్తం ఖాళీ స్థల విస్తీర్ణం. 329.66 చ॥గ॥లు, సమము 275.63 చ॥మీ॥లు, **డాక్యుమెంట్ నెం. 6439/2024** గల ఆస్తికి హద్దులు : **తూర్పు**: బానోతు శంకర్ గారి స్థలమునకు పోవు దారి, **పడమర** : గ్రామ పంచాయితి రోడ్డు, **ఉత్తరం** : బానోతు శంకర్ గారి స్థలము, **దక్షిణం** : రాగ గారి స్థలము.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

భవనం పైనుంచి పడి విద్యార్థినికి గాయాలు

కేసముద్రం, జూలై11: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల భవనం పై నుంచి పడి విద్యార్థినికి గాయాలైన ఘటన ఈ నెల 9న జరిగింది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. కురవి మండలం బీబీనాయక్ తండకు చెందిన బోడ ముని- పద్మ దంపతుల కుమార్తె పవిత్ర గిరిజన గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. అనారోగ్యానికి గురవగా తండ్రి ముని పవిత్రను ఈ నెల 5న ఇంటికి తీసుకెళ్లాడు. తిరిగి 9న సాయంత్రం పాఠశాలకు వచ్చిన కొద్ది సేపటికి భవనం మొదటి అంతస్తు పై నుంచి జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఖమ్మం తరలించగా, తలకు తీవ్రగాయాలు, రెండు చేతులు విరిగినట్లు వైద్యులు తెలిపారు. భవనం పై నుంచి గుర్తు తెలియని వ్యక్తి తోసివేసినట్లు విద్యార్థిని తండ్రి ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ దామోదర్, ఎస్సై వంశీధర్ గురువారం పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. పవిత్ర తనంతట తానే ప్రమాదావశాత్తు జారి కింద పడి ఉంటుందని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

బయ్యారం, జూలై 11: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండలంలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇర్రి లింగయ్య (76) నాలుగు రోజుల క్రితం వరంగల్‌లో ఉంటున్న కూతురు వద్దకు వెళ్తునాని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అక్కడికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకి దొరక్క పోవడంతో కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిందితుడికి పదేళ్ల జైలు

రూ.10వేల జరిమానా

డోర్నకల్, జూలై 11: భార్యను వేధింపులకు గురిచేసి ఆమె మృతికి కారణమైన నిందితుడికి జిల్లా జడ్జి పదేళ్ల జైలు శిక్ష, రూ. 10వేల జరిమానా విధించారు. సీఐ ఉపేందర్‌రావు కథనం ప్రకారం.. డోర్నకల్‌లోని సుభాశ్ స్ట్రీట్‌కు చెందిన గొల్లపల్లి ఆగ్నేశ్ గోంషా బుజక్షో భర్త ప్రవీణ్ వేధింపులు తట్టుకోలేక 2019 సంవత్సరంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తల్లి పుచ్చకాయల బేబీరాణి (ఆశ వర్కర్) ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం గురువారం మహబూబాబాద్ జిల్లా జడ్జి పీ చంద్రశేఖర ప్రసాద్ నేరం రుజువైనందున ప్రవీణ్‌కు 10 ఏళ్లు కఠినమైన కారాగారా శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కన్విక్షన్ విషయంలో ప్రతిభ కనబర్చి విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

మహబూబాబాద్ రూరల్, జూలై 11: చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందిన ఘటన మండలంలో గురువారం జరిగింది. రూరల్ ఎస్సై దీపికారెడ్డి కథనం ప్రకారం.. కంబాలపల్లి గ్రామానికి చెందిన సందు సురేశ్, సునీత కుమార్తె చార్లిక (7) రెండో తరగతి చదువుతున్నది. పాఠశాలకు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా మానుకోట నుంచి వేగంగా వచ్చిన కారు చిన్నారిని డీకొట్టడంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చార్లిక మృతి చెందింది. తండ్రి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హెచ్‌ఎంల పోస్టులు భర్తీ చేయాలి

తొర్రూరు, జూలై 11: ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మల్లారెడ్డి అన్నారు. గురువారం టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు భిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన సభ్యత్వ నమోదు, పాఠశాలల్లో సమస్యలను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రకటించిన 10వేల హెచ్‌ఎంల పోస్టుల్లో కాంగ్రెస్ సర్కారు కొన్ని మాత్రమే నింపిందని, మిగిలిన 5,571 పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం తొర్రూరు, అమ్మాపురం, గుర్తూరు, కంతాయపాలెం, చెర్లపాలెం ఉన్నత పాఠశాలలు, టీఎస్ ఎంఎస్ గుర్తూరు, యూపీఎస్ సోమారం పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నాగమల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి యాకూబ్, ఉపాధ్యక్షుడు రఫీ, కార్యదర్శులు శంకర్, రాయలు, మల్లయ్య, యాకేందర్ పాల్గొన్నారు.

సుగంధ ద్రవ్యాల సాగుతో రైతులకు లబ్ధి

మహబూబాబాద్ రూరల్, జూలై 11 : సుగంధ ద్రవ్యాలను సాగు చేస్తే రైతులకు ఎంతో లబ్ధి జరుగుతుందని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమలశాఖ అధికారి మరియన్న అన్నారు. గురువారం పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుగంధ ద్రవ్యాల సాగుతో పాటు ఆయిల్‌పామ్ పంటలను సాగు చేయాలన్నారు. మిరప పంట సాగుపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజుగౌడ్, రాంబాబు, దామోదర్, డీఏవో అభిమన్యుడు, డాక్టర్ మాలతి, ఐకాన్ అవార్డ గ్రహీత జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి యోగా దోహదం

దంతాలపల్లి, జూలై 11: యోగా విద్యార్థి వ్యక్తిత్వ, మానసిక, శారీరక వికాసానికి దోహదం చేస్తుందని దంతాలపల్లి జడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం వేణుమధవ్‌రెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో 'యోగా ఫర్‌హెల్త్ ఇంగ్లిష్ ఫర్ వెల్త్' కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ టీ వెంకటరాజయ్య యోగా, వ్యక్తిత్వ వికాసం, ఇంగ్లిష్ భాషపై అవగాహన కల్పించారు. సప్తయోగ ఆసనాలను విద్యార్థులతో వేయించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, గోవర్ధన్, శ్రీదేవి, సురేందర్‌గుప్తా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి సర్కారు పెద్దపీట

- తాగునీటి సమస్య లేకుండా శాశ్వత నిర్మాణాలు
- ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, జూలై 11: తొర్రూరు మున్సిపాలిటీలో తాగునీటి సమస్య లేకుండా శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టేందుకు అమృత్ వాటర్ ద్వారా రూ.27.42కోట్ల నిధులు మంజూరయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్దపీట వేసిందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు రూ.27.42 కోట్ల నిధులతో 900 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన మూడు పెద్ద వాటర్ ట్యాంకులు, 40 కిలోమీటర్ల మేర పైపులైన్ విస్తరణకు చేపట్టనున్న పనులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో తొర్రూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. వరంగల్- ఖమ్మం హైవేకు ఇరువైపులా రోడ్డువెడల్పు చేసి డ్రైనేజీ నిర్మాణం కోసం సుమారు రూ.8కోట్లతో పనులు ప్రారంభించామన్నారు.

సీఎం కృషితో మున్సిపాలిటీలో రూ.62కోట్ల మేర విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కమిషనర్ పీ శాంతికుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌రెడ్డి, డీఈ నవీన్, మున్సిపల్ ఏఈ రంజిత్, కౌన్సిలర్లు రాము, రోజాప్రభుదాస్, గజానంద్, కే శంకర్, డీ శంకర్, మాధవీ అనిల్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎన్నికల అఫిడవిట్‌పై విచారణ చేయాలి

మహబూబాబాద్ రూరల్: పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఎన్నికల్లో సమర్పించిన అఫిడవిట్‌పై పూర్తి విచారణ చేయాలని బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా శిక్షణ తరగతుల కన్వీనర్ దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొర్రూరు శివారు గుర్తూరులో 70ఎకరాల భూమిని కొనుగోలు చేశారని, అఫిడవిట్‌లో మాత్రం తక్కువగా చూపించారన్నారు. దీనిపై విచారణ చేస్తే రుజువు అవుతుందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు వీవీ రావు, పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీను, పల్లె సందీప్, నరేశ్ పాల్గొన్నారు.

'హామీలను వెంటనే అమలు చేయాలి'

తొర్రూరు, జూలై 11: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పల్లె కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రూరల్ మండల అధ్యక్షుడు బొచ్చు సంతోష్‌తో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని, ప్రతి రైతుకు రైతు భరోసా రూ.15వేలు చెల్లించాలని, కౌలు రైతులకు రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు అందించాలన్నారు. రైతు కమిషన్ ఏర్పాటు చేయాలని, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్రంలో అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు, నాయకులు పీ రాజేశ్, జీ శేఖర్, ఎం యాకయ్య, కే నవీన్, జీ రాజు, ఎన్ సందీప్, సంతోష్, ఎన్ నవీన్, శ్రీనివాసచారి, శ్రీనాథ్, నాగేశనాయక్, తేజస్, రామ్మూర్తి, భాస్కరాచారి పాల్గొన్నారు.

'కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యూలర్ చేయాలి'

నర్సింహులపేట, జూలై 11: సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అందించాలని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యూలర్ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ గురుకుల పాఠశాలలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, తిరుపతి, కృష్ణ ఉన్నారు.

'కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరగాలి'

గార్ల, జూలై 11: కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల కార్యనిర్వాహణ అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్త్రీశక్తి అవార్డు గ్రహీత షాంశాద్ బేగం, రాము, పృథ్వీ రాజ్, వీరన్న పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

పెద్దవంగర, జూలై 11: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో చదవాలని ఎంఎన్‌వో బీ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని కాన్వాయిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సొంతంగా రూ.25వేలతో విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చంద్రకాంత్, సీఆర్‌పీలు నిరంజన్, రమాదేవి ఉన్నారు.

కార్మికుల హక్కుల సాధనే సీపీఐ లక్ష్యం

మరిపెడ, జూలై 11: కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా సీపీఐ ఉద్యమిస్తున్నదని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయసారథి అన్నారు. గురువారం మున్సిపల్ కేంద్రంలో మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ మతతత్వ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. రాష్ట్ర విభజన అంశాలపై కనీసం నోరెత్తని బీజేపీ ఎంపీల అసమర్థతపై ప్రజలు నిలదీయాలన్నారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి అబ్దుల్ రశీద్ తండ్రి ఖాదర్ అనారోగ్యానికి గురవగా పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

గార్ల, జూలై 11: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలోని వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత అన్నారు. గురువారం ఆమె సీహెచ్‌సీని సందర్శించి రోగులతో మాట్లాడారు. దవాఖానలో వైద్యసిబ్బంది లేక రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వర్షాకాలంలో గ్రామాలు, తండాల్లో విషజ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, వైద్యసేవలు మెడిసిన్, సౌకర్యాలు పూర్తి స్థాయిలో రోగులకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి అలవాల సత్యవతి, మల్లెల నాగమణి, చింత మౌనిక, రామ, సుజాత, పద్మ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన

మహబూబాబాద్ రూరల్, జూలై 11: పట్టణంలోని నెహ్రూ సెంటర్‌లో గురువారం మధ్యాహ్నం జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పర్కాల రవీందర్ రెడ్డి, చిత్తనూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో విలేకరి శ్రీచరణ్‌పై పోలీసులు దాడి చేయడం సరికాదన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృత్తం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధు, రామ, శ్రీహరి, రంగ, కుమార రమేశ్ పాల్గొన్నారు.